క్లుప్తంగా

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పోరంకి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తామని పేర్కొన్నారు. సాలిపేట, పెనమలూరు సెంటర్, ఏవీఎం గార్డెన్స్, సిద్ధిక్‌నగర్, బందరురోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



పెనమలూరు: ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన సోమవారం యనమలకుదురు, చోడవరం ఇసుక క్వారీలను పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాసరావు వివరాలు తెలుపుతూ పెనమలూరు పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం ఇసుక క్వారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వీటి వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేయకూడదని, ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కొండముచ్చుల స్వైర విహారం



ఉంగుటూరు: కొండముచ్చుల స్వైర విహారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పెద్ద అవుటపల్లిలో కొండ ముచ్చులు, కోతులు గుంపులు, గుంపులుగా గృహాల్లోకి చొరబడుతున్నాయి. ఒంటరిగా ఉన్న వారిని గాయపరచి వెళుతున్నాయి. ఈ నెల 5వ తేదీన బ్రదర్ జోసఫ్ తంబి చర్చికి వచ్చిన లోకాసు అనే వ్యక్తిపై కొండ ముచ్చు దాడి చేసి మోకాలు కండను పీక్కును పారిపోయింది. ఆ వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో బంధువులు సమీపంలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొద్ది రోజులుగా గ్రామంలో కొండముచ్చుల దాడిలో ప్రజలు గాయపడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గ్రామంలో ఉన్న కొండముచ్చులను దూరంగా పంపించే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సామూహిక ఎలుకల నివారణతో పంటకు మేలు

పెనమలూరు: రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె సోమవారం మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి మండల పరిధిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడతామన్నారు. ఎలుకల మందు తయారు చేయడానికి రైతులకు బ్రోమోడయాలిన్ మందు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. 100 గ్రాముల మందు తయారు చేయడానికి 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల మంచి నూనె, 2 గ్రాముల బ్రోమోడయాలిన్ మందు కలిపి తయారు చేసి ఎలుకలు నివసించే బొరియల వద్ద ఉంచాలన్నారు. రైతులు సామూహిక ఎలుకల నివారణ చేస్తే పంటకు మేలు కలుగుతుందని వివరించారు.

తొమ్మిదిమంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురులో పేకాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వాటర్ ప్లాంట్ రోడ్డు కుసుమా రెసిడెన్సీలో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.28,300, మొబైల్ ఫోన్లు 7 స్వాధీనం చేసుకున్నారు. సుంకర రమేష్ అనే వ్యక్తి పేకాటరాయుళ్ల వద్ద రూ.1000 వసూలు చేసి కోతముక్క ఆట నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుల పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

సాయిబాబా విగ్రహాలు తొలగించడం హేయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వారణాసిలో షిర్డీ సాయిబాబా విగ్రహాలను తొలగించడం హేయమైన చర్య అని షిర్డీసాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు కోడెబోయిన బాబి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను ప్రభుత్వం అడ్డుకోకపోతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. 'సబ్ కా మాలిక్ ఏక్' అని షిర్డీ సాయిబాబా బోధించారని, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తులతో పూజలందుకుంటున్న సాయిబాబా విగ్రహాలు తొలగించడం తగదని హితవు పలికారు.

పడకేసిన పారిశుధ్యం

అంబాపురంలో పేరుకున్న చెత్తాచెదారం

అంబాపురం(విజయవాడరూరల్): మండలంలోని అంబాపురం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామస్తులకు వరద బెడద తొలగినా వరద మిగిల్చిన మరకలు కనిపిస్తున్నాయి. వరదల కారణంగా ఇళ్లలోకి నీరు చేరడంతో గృహోపకరణాలు పనికిరాకుండా తడిసి పోవడంతో ఆ వ్యర్థాలు రోడ్లపై దర్శనమిస్తున్నాయి. ఒకటో వార్డు పదో రోడ్డులో ఉన్న పార్కులో స్థానికులు ఇళ్లలోని పనికిరాని వస్తువులను వేయడంతో చెత్త డంపింగ్‌లా మారింది. వృద్ధులు, పిల్లలు వాకింగ్ చేసుకోవడానికి, ఆడుకోవడానికి ఉపయోగపడాల్సిన పార్కు చెత్తకు నిలయంగా మారింది. దాని నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



అంబాపురంలో రోడ్ల పై చెత్తకుప్పలు

ఖాళీ స్థలాలు డంపింగ్‌యార్డ్‌లా..

మొన్నటి వరకు వరద బురదను శుభ్రం చేసుకుని వీధుల్లో నుంచి ఇళ్లలోకి వస్తుంటే దుర్వాసన వస్తుండేది. ఒకటో వార్డులో రోడ్లన్నీ చెత్తా చెదారంతో నిండటంతోపాటు పంచాయతీ కార్యాలయం చుట్టుపక్కల ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. పేరుకు పోయిన చెత్తా చెదారం నిల్వలతో దోమలు, ఈగలు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాటిని తొలగించకపోతే అంటువ్యాధులు ప్రబలుతాయనని పంచాయతీలో చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పారిశుధ్య కార్మికులకు చెత్తను సేకరించేందుకు అవసరమైన నాలుగు రిక్షాలను కొనుగోలు చేసినా అవి పంచాయతీ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్నాయని చెబుతున్నారు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పారుదల ఉండటం లేదంటున్నారు. పైపులరోడ్డు సమీపంలోని గ్రామ సరిహద్దులో వరదలకు సంబంధించిన నీరు ఖాళీ ప్రాంతంలో నిల్వ ఉండటంతో వాటి నుంచి దోమల బెడద అధికంగా ఉందని వాటిని తోడించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాలను తొలగించాలి



పదో లైన్లో ఉన్న పార్కు వ్యర్థాలతో నిండి చెత్తడంపింగ్ కేంద్రంగా మారింది అక్కడ నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. పంచాయతీ అధికారులు వెంటనే పార్కులోని వ్యర్థాలను తొలగించాలి

–ఎంవీ విజయ్, పదోలైన్, అంబాపురం

వ్యాధులు వస్తాయని భయంగా ఉంది



జన్మభూమి రోడ్డులో రెండువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పల వద్ద పందుల స్వైర విహారం చేస్తున్నాయి. పందుల కారణంగా వ్యాధులు సంభవిస్తాయనే భయంగా ఉంది. పంచాయతీ పాలకవర్గం గ్రామ పారిశుధ్యం మెరుగు పర్చేందుకు దృష్టి పెట్టాలి.

–పి.బుజ్జిబాబు, అంబాపురం

టీడీపీలో 'ఏఎంసీ' ముసలం!

- వైస్‌ఛైర్మన్ ఎంపికలో నేతల అసంతృప్తి
- మూకుమ్మడి రాజీనామాలకు సన్నద్ధం
- ఏకపక్ష ధోరణిపై తమ్ముళ్ల అలక

కంకిపాడు: టీడీపీలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ముసలం రేగింది. పాలకవర్గ ఎంపికలో అధిష్టానం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందంటూ తమ్ముళ్లు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కనీస చర్చ కూడా లేకుండా వైస్ చైర్మన్‌ను ఎంపిక చేయడంపై కొందరు టీడీపీ నేతలు మూకుమ్మడి రాజీనామాలకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో అధిష్టానం తమ్ముళ్ల బుజ్జగింపు పర్వానికి తెరతీసింది. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పెనమలూరు, కంకిపాడు మండలాల్లో విస్తరించి ఉంది. కంకిపాడు మార్కెట్‌యార్డు కేంద్రంగా కమిటీ పనిచేస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అధిష్టానం నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా పెనమలూరు ఏఎంసీ పాలకవర్గ ఎంపికకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కసరత్తు చేశారు. కూటమిలో భాగస్వాములైన ముఖ్యనేతల సమన్వయంతో పాలకవర్గాన్ని దాదాపు ఖరారు చేశారు. ఈ మేరకు కమిటీని ప్రభుత్వ ఆమోదం కోసం నివేదిక సిద్ధం చేస్తున్నారు.

వైస్ చైర్మన్‌పై అసంతృప్తి

కమిటీ చైర్మన్‌గా కంకిపాడు మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, రైతు అన్నే ధనయ్య పేరు దాదాపుగా ఖరారు చేశారు. వైస్‌చైర్మన్‌గా పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన ఎస్.రంగారావు పేరును ప్రతిపాదించారు. కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీలకు సైతం కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తూ కమిటీని ఖరారు చేశారు. రంగారావు పేరు ఖరారుపై ఆ పార్టీ నేతల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన వ్యక్తికి ఎలా ప్రాధాన్యమిస్తారంటూ ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. పేరు ప్రతిపాదించే క్రమంలో పార్టీని ఎంతో కాలంగా నమ్ముకుని పనిచేసిన తమతో కనీసం సంప్రదించకపోవడం అవమానకరమంటూ సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసే యోచనలో ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. విషయం బయటకు పొక్కటంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అసంతృప్తులను చల్లార్చే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.



కంకిపాడు మార్కెట్‌యార్డులోని ఏఎంసీ కార్యాలయం

కంకిపాడుకు ప్రాధాన్యమేదీ..

మరో వైపు కమిటీ ఏర్పడిన నాటి నుంచి కంకిపాడుకు సరైన ప్రాతినిధ్యం లేదంటూ కూటమి శ్రేణులు మదనపడుతున్నాయి. సామాజిక మాధ్యమాల వేదిగా తమ మనోభావాలను వ్యక్తం చేస్తూ కమిటీ ఎంపికపై చర్చ సాగిస్తున్నారు. కంకిపాడు గ్రామానికి ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్ వంటి కీలక పదవులు ఏవీ దక్కలేదని, సరైన ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పార్టీలో సీనియర్లు అధిష్టానానికి సైలెంట్‌గానే హెచ్చరికలు చేయడం గమనార్హం.

కారు బీభత్సం

కానూరులో యువకుల హంగామా

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై కానూరు పప్పుల మిల్లు వద్ద సోమవారం వేకువజామున కారు బీభత్సం సృష్టించింది. ఘటనలో మూడు దుకాణాలు ధ్వంసమయ్యాయి. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం వేకువజామున ఐదుగురు యువకులు కారులో కేరింతలు కొడుతూ టపాసులు కాల్చుతూ హడావుడి చేస్తూ అతివేగంగా కారు నడిపారు. పప్పులమిల్లు సెంటర్ వద్దకు వచ్చిన తర్వాత కారులో యువకులు రోడ్డుపై బాణసంచా వేసి బీభత్సం సృష్టించారు. కారును అతి వేగంగా నడపటంతో అది అదుపు తప్పి ఫొటో స్టూడియో, రాజస్తాన్ టీ షాపు, పక్కనే ఉన్న బడ్డీ కొట్టులోకి దూసుకెళ్లింది. ఘటనలో మూడు దుకాణాలు, కారు ధ్వంసమయ్యాయి. దుకాణ యజమానులకు ఆస్తి నష్టం కలిగింది. కారులో ఉన్న యువకులకు గాయాలయ్యాయి. ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పారిపోయారని పోలీసులు తెలిపారు. వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

టీడీపీకి చెందిన యువకులే!

కారు అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన వారిలో విజయవాడ 49వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకురాలి కుమారుడితో పాటు, పలువురు టీడీపీ నేతల పిల్లలు ఉన్నారని తెలుస్తోంది. దీంతో పోలీసుల పై ఒత్తిడి తీసుకు వచ్చి కేసు తీవ్రతను తగ్గించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అర్ధరాత్రి మితిమీరిన వేగంతో కారు నడపటమే కాకుండా భయభ్రాంతులకు గురిచేసేలా రోడ్డుపై టపాసులు కాల్చడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు నష్టపరిహారం ఇవ్వాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని దుకాణం యజమానులు హెచ్చరిస్తున్నారు.



ధ్వంసమైన టీ స్టాల్



ఘటనకు కారణమైన కారు ఇలా

మద్యం దరఖాస్తులను అడ్డుకునేందుకు టీడీపీ యత్నం!

గన్నవరం: మద్యం దుకాణాల లైసెన్స్‌లు దక్కించుకునేందుకు సిండికేట్‌గా ఏర్పడిన టీడీపీ నేతలు ఇతరులు దరఖాస్తులు వేయకుండా అడ్డుకున్న ఘటన గన్నవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం షాపుల లైసెన్స్‌లు కోసం దరఖాస్తులు సమర్పించేందుకు కొంత మంది వచ్చారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ నేతలు ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. సదరు దరఖాస్తుదారులు కార్యాలయంలోకి వెళ్లకుండా బయటే టీడీపీ నేతలు అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతలంతా కలిసి దరఖాస్తులు వేస్తున్నామని, కాదని ఇతరులు అప్లికేషన్లు ఇస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. దీంతో సదరు దరఖాస్తుదారులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో విషయం బయటకు పొక్కుతుందని టీడీపీ నేతలు అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం సదరు దరఖాస్తుదారులు ఎక్సైజ్ ఆఫీస్ లోపలికి వెళ్లి ఆఫ్‌లైన్‌లో అప్లై చేశారు. టీడీపీ నేతల హడావుడి విషయం తెలుసుకున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు చేరుకుని వివరాలు సేకరించారు.



గన్నవరంలో ఎక్సైజ్ కార్యాలయం

ఈ క్రాప్ నమోదు పరిశీలన

కంకిపాడు: ఈ క్రాప్ నమోదు సమర్థంగా ఉంటేనే రైతులకు ప్రయోజనాలు కలుగుతాయని ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్‌హెచ్ షారోన్ అన్నారు. మద్దూరు గ్రామంలో సోమవారం ఈ క్రాప్ నమోదు సూపర్ చెక్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ షారోన్ గ్రామంలో పర్యటించి ఈ క్రాప్ నమోదు తీరుతెన్నులను పరిశీలించారు. నమోదులో సిబ్బంది పాటిస్తున్న నిబంధనలు తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ సమర్థంగా పూర్తి చేస్తేనే రైతులకు ప్రయోజనాలు అందుతాయన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ వి.భావనారాయణ, వీఆర్వోలు నాగిరెడ్డి, సుబ్బారావు, సర్వేయర్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్దూరులో ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఆర్డీఓ షారోన్

రామలింగేశ్వరుడికి శ్రీకాళహస్తి నుంచి పట్టు వస్త్రాలు

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారికి సోమవారం దసరా మహోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఉపదేశించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఈవో భవాని, పలువురు దేవదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.



భక్తులకు ఉపదేశమిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్

పాహిమాం.. రక్షమాం

మహాచండిగా అమ్మవారి దర్శనం

కంకిపాడు: మహాచండీ.. పాహిమాం.. రక్షమాం.. అంటూ భక్తజనం దుర్గమ్మను మనసారా కొలిచి ప్రత్యేక పూజలు చేశారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తుల పూజలందుకున్నారు. ప్రొద్దుటూరు శివాలయంలో మహాచండీ దేవిగా కాశీ అన్నపూర్ణాదేవి దర్శనమిచ్చారు. ఉప్పలూరు, మంతెన, మద్దూరు, కంకిపాడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శివాలయం, కొండ మీద శ్రీ భువనేశ్వరీ మాత ఆలయం, ముస్తాబాద శివాలయాల్లో శ్రీ మహాచండీ దేవీగా అమ్మవారిని భక్తులు దర్శించారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్పురంలో మంగళ గౌరీదేవిని శ్రీ మహాచండీదేవీగా అలంకారం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెనమలూరు: యనమలకుదురు శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. యనమలకుదురు శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని స్కంద మాత దేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. సోమవారం కావడంతో శ్రీ రామలింగేశ్వరస్వామిని అభిషేకించారు. పోరంకి సాయిబాబా మందిరంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు. పెదపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ సోమవారం శ్రీ మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఐదో రోజు దాతలు అందించిన పలు రకాల పుష్పాలతో అమ్మవార్లను శ్రీ మహా చండీ దేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తన్మయి బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈఓ పి. ప్రియాంక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక శ్రీగాయత్రీమాత మందిరంలో చండీ హోమం చేశారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలలితాదేవిగా అమ్మవారు భక్తులతో పూజలందుకున్నారు. దావాజీగూడెంలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయం, అల్లాపురంలో శ్రీదుర్గ కల్చరల్ అసోసియేషన్, యాదవుల రామాలయం, శ్రీవాసవీమాత మందిరంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

విజయవాడరూరల్: నైనవరం శ్రీశివనాగేంద్ర స్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీసంతానలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు తులసీ లక్ష్మణాచార్యులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దావు పెద్దశ్రీనివాసరావు, సెక్రటరీ జోసెఫ్,గణాచారి భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నున్న చినకంచిలో కామాక్షి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. చెరువు సెంటర్‌లోని శ్రీదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా మందిరంలో అమ్మవారిని, బోడపాడులో శ్రీగంగానమ్మ ఆలయంలో శ్రీమహాచండీదేవిగా ప్రత్యేక పూజలు చేశారు.

ఉయ్యూరు: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉత్సవాల్లో ఐదో రోజు సోమవారం అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద ఓగిరాల శివాలయంలో విశేష పూజలు జరిపించారు.



ప్రొద్దుటూరు శివాలయంలో మహాచండీదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి



పి.నైనవరంలో..



మహాచండీదేవిగా వెంకమ్మ పేరంటాలమ్మ



యనమలకుదురులో..

ఫిర్యాదుదారులపై పోలీసుల జోక్యం వివాదాస్పదం!

కోర్టు పరిధిలోని కేసు అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

గన్నవరం: వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేతలపై ఉన్న కేసులను మాఫీ చేసేందుకు ఫిర్యాదుదారులపై ఎస్ఐ స్థాయి అధికారి ఒత్తిడి తీసుకురావడం వివాదస్పదమైంది. కోర్టు పరిధిలో ఉన్న కేసును మాఫీ చేసేందుకు ఎస్ఐ బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడుతున్న విషయాన్ని ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కేసులో నిందితుడైన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఒత్తిడి మేరకు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసును ఉపసంహరించుకోవాలని సదరు ఎస్ఐ ఈ తరహా ప్రలోభాలకు పాల్పడుతున్నట్లుగా పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ఎస్సీ, ఎస్టీ ప్రజలపై అఘాయిత్యాల నివారణకు, వారి ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. ఇప్పటికైన సదరు ఎస్ఐ కోర్టు పరిధిలో ఉన్న చట్టపరమైన అంశాల్లో జోక్యం చేసుకోకుండా మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరమైతే ఈ విషయాన్ని జాతీయ స్థాయి ఎస్సీ, ఎస్టీ కమీషన్, న్యాయస్థానాల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు



కంకిపాడు: అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన పలువురు అధికారులకు సోమవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. మెరుగైన సేవలు అందించడంతో ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అంకితభావంతో పనిచేయాలని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రజలకు సమర్థంగా సేవలు అందుతాయన్నారు. బదిలీపై వెళ్లిన ఏఈ ఉదయ్‌భాస్కర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు



పెనమలూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ ఉప సర్పంచిలు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాస్(ఆర్‌జీఎస్ఏ) కార్యాచరణ ప్రణాళిక 2024–2025 లో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వార్డు సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో వి.ప్రణవి మాట్లాడుతూ రెండు రోజుల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. వీటిలో ఉపసర్పంచిలు, వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధిపై అవగాహన పొందాలని సూచించారు.